సాక్షి
కామారెడ్డి
ఆదివారం । 18 । మే । 2025



ఆటలతో సందడి

విద్యార్థులలో క్రీడా నైపుణ్యాలను వెలికి తీసేందుకు జిల్లాలోని పలు ప్రాంతాలలో సమ్మర్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నారు.

- 8లో ▸



మొరం పోసి వదిలేశారు

దోమకొండ -ముత్యంపేట రోడ్డు పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
40.2 /23.4

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

ఈసారైనా స్పందించేనా?

ఎల్‌ఆర్‌ఎస్‌–2020 స్కీం కింద ప్రభుత్వం 25 శాతం రాయితీ ఇచ్చినా దరఖాస్తుదారులు స్పందించడం లేదు. ఇప్పటికే మూడుసార్లు గడువు ఇచ్చినా 30 శాతం కూడా ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించలేదు. దీంతో అక్రమ లేఅవుట్లలోని ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం మరోసారి గడువు పొడిగించడంతోపాటు నిబంధనల్లోనూ మార్పులు చేసింది. గిఫ్ట్, వారసత్వ డీడ్‌ల ద్వారా జరిగే లావాదేవీలను కూడా పరిశీలనలోకి తీసుకోనున్నట్టు ప్రకటించింది.



- ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లింపుపై అనాసక్తి
- మూడు విడతల్లో స్పందించింది 30 శాతం దరఖాస్తుదారులే..
- నాలుగోసారి గడువు పొడిగించిన సర్కారు
- క్రమబద్ధీకరణ నిబంధనల్లో మార్పులు
- గిఫ్ట్, వారసత్వ డీడ్‌ల ద్వారా రెగ్యులరైజేషన్‌కు అనుమతి

మూడు విడతల్లో వచ్చిన ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు వివరాలు..

మున్సిపాలిటీ పేరు	దరఖాస్తులు	ఫీజు చెల్లించినవారు	ఆదాయం (రూ.లలో)
కామారెడ్డి	17,687	4,580	10.88 కోట్లు
బాన్సువాడ	1903	347	90 లక్షలు
ఎల్లారెడ్డి	910	239	38 లక్షలు
మొత్తం	20,500	5,166	12.16 కోట్లు

కామారెడ్డి టౌన్ : అనధికార ప్లాట్లు, అక్రమ వెంచర్ల క్రమబద్ధీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్–2020 పేరిట దాదాపు ఐదేళ్ల క్రితం దరఖాస్తులు స్వీకరించింది. అయితే ఆ ప్రక్రియ దరఖాస్తుల దశలోనే నిలిచిపోయింది. ప్రభుత్వం ఇటీవల దానిని పట్టాలెక్కిస్తూ 25 శాతం రాయితీతో ఫిబ్రవరిలో వన్‌టైం సెటిల్మెంట్ పథకాన్ని ప్రకటించింది. దీనికి మార్చి 31వ తేదీ వరకు గడువు ఇచ్చింది. అయితే దరఖాస్తుదారుల నుంచి స్పందన రాకపోవడంతో ఏప్రిల్ 30 వరకు గడువును పొడిగించింది. ఆ తర్వాత ఈనెల 3వ తేదీ వరకు అవకాశమిచ్చింది. ఎల్‌ఆర్‌ఎస్ వేగవంతం కోసం జోరుగా ప్రచారం చేస్తున్నా, కలెక్టరేట్, బల్దియా కార్యాలయాల్లో సహాయ కేంద్రాలు ఏర్పాటు చేసినా అంతగా స్పందన రాలేదు. దీంతో ఇటీవల నాలుగోసారి ఎల్‌ఆర్‌ఎస్ గడువును పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈనెల 31 వరకు అవకాశం ఇచ్చింది.

ఫీజు చెల్లించింది 5,166 మందే..

జిల్లాలోని కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి మున్సిపాలిటీలలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు 20,500 వచ్చాయి. అయితే ఎల్‌ఆర్‌ఎస్‌కు 5,166 మంది దరఖాస్తుదారులు మాత్రమే ఫీజు చెల్లించారు. అంటే 30 శాతం కూడా దరఖాస్తుదారులు స్పందించలేరు. ఇందులో 1,755 మంది దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించారు. దరఖాస్తుదారుల ప్లాట్లను క్రమబద్ధీకరిస్తూ ప్రొసిడింగ్ పత్రాలను అందజేశారు. ఈనెల 3వ తేదీవరకు మూడు మున్సిపాలిటీలకు రూ. 12.16 కోట్ల ఆదాయం మాత్రమే సమకూరింది. నాలుగోసారి గడువు పెంచడంతో మరికొంతమంది స్పందించే అవకాశాలున్నాయని భావిస్తున్నారు.

కాగా బల్దియాలలో టౌన్ ప్లానింగ్ విభాగంలో అధికారులు, సిబ్బంది పోస్టుల ఖాళీలతో వచ్చిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలనకు సాధ్యం కావడం లేదని అధికారులు పేర్కొంటున్నారు. కామారెడ్డి బల్దియాలో రెండు టీపీవో పోస్టులకు ఒకరు మాత్రమే ఉన్నారు. అలాగే నాలుగు టీపీఎస్ పోస్టులుండగా ఒక్కరు, నాలుగు టీపీబీఎస్ పోస్టులకు ఒక్కరు మాత్రమే ఉండడం గమనార్హం. ఈ నేపథ్యంలో దరఖాస్తులను పరిష్కరించడంలో ఆలస్యం అవుతుండడంతో దరఖాస్తుదారులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వారసత్వానికి సెల్ డీడ్ లేకున్నా..

దరఖాస్తుదారుల ప్రధాన సమస్యకు మున్సిపల్ శాఖ తాజాగా పరిష్కారం చూపింది. గతంలో ఎల్‌ఆర్‌ఎస్‌కు తప్పనిసరిగా సెల్‌డీడ్‌ను జతపరిస్తేనే సంబంధిత ప్లాటు లేదా లే అవుట్ క్రమబద్ధీకరణకు అవకాశం ఉండేది. ఇప్పుడు నిబంధనల్లో సవరణలు చేశారు. రిజిస్టర్డ్ గిఫ్ట్ డీడ్, ఎక్స్ఛేంజ్ డీడ్ లేదా వారసత్వ హక్కుతో స్థలాన్ని పొందిన వారు కూడా ఇప్పుడు క్రమబద్ధీకరణకు అర్హులని సర్కారు పేర్కొంది. ఈ నేపథ్యంలో నాలుగో విడత గడువులో దరఖాస్తుదారులు ఏ మేరకు స్పందిస్తారో చూడాలి.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం, మున్సిపల్ శాఖ ఎల్‌ఆర్‌ఎస్ గడువును ఈ నెలాఖరు వరకు పొడగిస్తూ జీవో జారీ చేసింది. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అక్రమ లేఅవుట్ ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలి. లేకపోతే గడువు ముగిసిన తర్వాత భవన నిర్మాణ అనుమతులకు ఇబ్బందులు పడాల్సి ఉంటుంది.

– రాజేందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, కామారెడ్డి

ఇందూర్‌లో భావ్‌సర్‌లు

బలూచిస్తాన్ ప్రత్యేక దేశంగా అవతరించాలని భారత ప్రజలు ముఖ్యంగా భావ్‌సర్ క్షత్రియులు బలంగా కోరుకుంటున్నారు. బలూచ్ ప్రాంతంలోని అమ్మవారి శక్తిపీఠాన్ని స్వేచ్ఛగా సందర్శించే అవకాశం కలుగుతుందని ఆశించడమే అందుకు ప్రధాన కారణం. విభజన సమయంలో బలూచ్ ప్రాంతాన్ని వీడి వచ్చిన భావ్‌సర్ క్షత్రియ సమాజ్ దేశంలోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. ఇందూరులో వేయి కుటుంబాలకు పైగా ఉండగా, వారు తమ ఆరాధ్య దైవం హింగులా మాత ఆలయాన్ని నిర్మించి ప్రత్యేకంగా కొలుస్తున్నారు.

- నగరంలో హింగులామాతకు ఆలయం
- భావసార్ క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో 1982లో నిర్మాణం
- దేశ విభజన సమయంలో ఇక్కడికి రాక
- ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో హింగులా శక్తిపీఠంపై ఆసక్తి



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో పాక్ ఆక్రమిత కశ్మీర్ కన్నా ఎక్కువగా ఆ దేశానికి నైరుతి భాగంలో ఉన్న బలూచిస్తాన్ అంశంపైనే దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. పాకిస్తాన్ నుంచి విడిపోయి స్వతంత్ర దేశంగా కొనసాగేందుకు బలూచిస్తాన్ తగిన ఏర్పాట్లు చేసుకుంటుండగా, భారతదేశంలోని ప్రతిఒక్కరూ ప్రత్యేక బలూచిస్తాన్ దేశం కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే భారతదేశ విభజన సమయంలో బలూచిస్తాన్ ప్రాంతం నుంచి ఇక్కడకు వచ్చిన భావ్‌సర్ క్షత్రియ సమాజ్ వారు మాత్రం మరింత ఆసక్తిగా, బలూచిస్తాన్ ప్రత్యేక దేశంగా అవతరించాలని బలంగా కోరుకుంటున్నారు. తమ మూలస్థానమైన బలూచ్‌లో కొలువై ఉన్న హింగులా మాతను మొక్కుకుంటున్నారు. అఖండ భారత్‌లో భాగమైన బలూచ్ ప్రాంతంలోని అమ్మవారి శక్తిపీఠాన్ని స్వేచ్ఛగా సందర్శించే అవకాశం కలగాలని కోరుకుంటున్నారు.

అమ్మవారి 52 శక్తి స్వరూపాల్లో ఒకటైన హింగులాదేవి ప్రధాన ఆలయం పాకిస్తాన్‌లోని బలూచిస్తాన్‌లోని హింగోల్ నేషనల్ పార్క్‌లో ఉంది. కరాచీకి 90 కిలోమీటర్ల దూరంలో హింగుల పర్వతంపై హింగోసీ నదీతీరం ఈ శక్తిపీఠానికి మూలస్థానం. హింగులా మాత అసలు పేరు కోటరి. హింగుల పర్వతంపై ఉండడంతో హింగులాదేవిగా ప్రసిద్ధి పొందింది. ఈ పర్వతంపై గుహలో హింగులామాత నిత్యం జ్వలిస్తూ దర్శనమిస్తోంది. ప్రకృతి నిర్మిత గుహ ఆలయంలో అమ్మవారు దర్శనమిస్తున్నారు. శ్రీకృష్ణదేవరాయల ఆస్థాన అష్టదిగ్గజాల్లో ఒకరైన అల్లసాని పెద్దన రచించిన మనుచరిత్రలో హింగులాదేవి ప్రస్తావన ఉంది.

ఇంతటి ప్రాచీన చరిత్ర కలిగిన శక్తిస్వరూపిణి ఆలయాన్ని ఇందూరు నగరంలో భావ్‌సర్ క్షత్రియ సమాజ్ (రంగరి) (వస్త్రాలకు రంగులు వేసే) ఆధ్వర్యంలో 1982లో నిర్మించారు.

దేశవిభజన సమయంలో ఇక్కడికి..

దేశవిభజన సమయంలో రంగరి (భావ్‌సర్ క్షత్రియ సమాజ్) కులస్తులు బలూచిస్తాన్ ప్రాంతం నుంచి రాజస్తాన్‌కు వలస వచ్చారు. ఆ తరువాత దేశంలోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. ప్రస్తుతం నిజామాబాద్ జిల్లాలో ఈ సమాజ్‌కు చెందిన వేయికి పైగా కుటుంబాలు ఉన్నాయి. పురాణాల ప్రకారం క్షత్రియులుగా ఉన్న వీరిని అంతమొందించేందుకు పరశురాముడు వెంటాడితే వీరి వంశీయులు దేవీ మాత శరణు కోరగా హింగులాదేవి కాపాడి వస్త్రాలకు రంగులు అద్దే కళను కటాక్షించింది. అప్పటి నుంచి ఈ వృత్తిని చేస్తున్నట్లు ఈ సమాజ్ పెద్దలు తెలిపారు.


ఇందూరులోని హింగుళాంబిక మాత ఆలయం

భూభారతి దరఖాస్తులపై సమీక్ష


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

లింగంపేట: భూభారతి సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు, క్షేత్ర స్థాయిలో విచారణ ఎంతవరకు వచ్చిందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. శనివారం సాయంత్రం ఆయన లింగంపేట తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని 23 రెవెన్యూ గ్రామాల్లో నిర్వహించిన సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు, విచారణ, పాజిటివ్, నెగెటివ్ ఉత్తర్వుల తయారీ విషయమై అన్ని క్షేత్ర స్థాయి టీమ్‌ల ప్రోగ్రెస్ గురించి తెలుసుకున్నారు. అదనపు కలెక్టర్ విక్టర్, సబ్ కలెక్టర్ కిరణ్మయి, ఆర్డీవో ప్రభాకర్, భూభారతి ప్రత్యేకాధికారి రాజేందర్ ఆయనకు వివరాలు తెలిపారు. దరఖాస్తుల విచారణ, ఉత్తర్వుల తయారీని త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

రూ.81 కోట్లకు వ్యాపారి ఐపీ!

నిజామాబాద్ రూరల్: నిజామాబాద్ రూరల్ మండలంలోని పాల్దా శివారులో ప్లాస్టిక్ బ్యాగులు తయారు చేసే ఫ్యాక్టరీ యజమాని రూ.81 కోట్లకు ఐపీ పెట్టినట్లు తెలిసింది. దీంతో అతనికి అప్పులు ఇచ్చినవారు లబోదిబోమంటున్నారు. ఈ విషయమై రూరల్ ఎస్‌హెచ్‌వోను వివరణ కోరగా ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఫుడ్ టెండర్లలో గోల్‌మాల్!

- జీజీహెచ్‌తో పాటు టీవీవీపీ ఆస్పత్రులకు డైట్ టెండర్‌ల నిర్వహణ
- టీవీవీపీ ఆస్పత్రులకు డ్రా పద్ధతిలో ఎంపిక
- జీజీహెచ్‌కు మాత్రం నేరుగా అప్పగించడంపై ఆరోపణలు

కామారెడ్డి టౌన్ : జిల్లాలో తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) పరిధిలో గల సీహెచ్‌సీలతో పాటు జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)కి సంబంధించి డైట్ టెండర్ ప్రక్రియ నిర్వహించారు. ఇతర ఆస్పత్రులకు డ్రా విధానంలో డైట్ కాంట్రాక్ట్ ఇవ్వగా.. జీజీహెచ్‌కు మాత్రం నిబంధనలకు విరుద్ధంగా నేరుగా ఎంపిక చేయడం వెనుక మర్మమేమిటన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రితో పాటు టీవీవీపీ పరిధిలోని బాన్సువాడ ఎంసీహెచ్, ఎల్లారెడ్డి, మద్నూర్, దోమకొండ, బిచ్కుంద, గాంధారి, జుక్కల్, పిట్లం సీహెచ్‌సీలలో చికిత్స పొందుతున్న రోగులు, డ్యూటీ వైద్యులకు రెండేళ్ల పాటు భోజనం అందించడం కోసం ఈనెల 3న జిల్లా డైట్ మేనేజ్‌మెంట్ కమిటీ టెండర్ నోటిఫికేషన్ విడుదల చేసింది. కాంట్రాక్టర్లు దరఖాస్తులు దాఖలు చేశారు. శనివారం కలెక్టరేట్‌లో డ్రా పద్ధతిలో కాంట్రాక్ట్‌లు అప్పగించారు. టీవీవీపీ ఆస్పతులకు ఆరోపణలకు తావులేకుండా డ్రా పద్ధతిలోనే కాంట్రాక్టర్లను ఎంపిక చేశారు.

జీజీహెచ్‌లో ఎందుకలా?

జిల్లా కేంద్రంలోని జిల్లా జనరల్ ఆస్పత్రిలో డైట్ నిర్వహణ కోసం ఆరు దరఖాస్తులు వచ్చాయి. ఒక దరఖాస్తును తిరస్కరించారు. సౌజన్య ఎంటర్‌ప్రైజెస్‌కు 85 మార్కులు, మణికంఠ ఎంటర్‌ప్రైజెస్‌కు 91, సరోజ, శ్రీనివాస్, అయ్యప్ప ఎంటర్‌ప్రైజెస్‌కు 100 మార్కులు కేటాయించారు. 100 మార్కులు వచ్చిన ఈ ముగ్గురి పేర్లతో డ్రా నిర్వహించాల్సి ఉంటుంది. అయితే డ్రా లేకుండానే నేరుగా సరోజ ఎంటర్‌ప్రైజెస్‌కు టెండర్ కట్టబెట్టడంతో మిగతా ఇద్దరు కాంట్రాక్టర్లు అవాక్కయ్యారు. దీనిపై వారు అధికారులను ప్రశ్నించినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో అధికారుల తీరుపై ఆరోపణలు వస్తున్నాయి. సదరు ఎంటర్‌ప్రైజెస్ గతంలో హైదరాబాద్‌లోని ఓ ప్రభుత్వ ఆస్పత్రిలో ఫుడ్ సరఫరాలో నాణ్యత లోపం, రోగులతోనే భోజనాల వడ్డింపు లాంటి రిమార్కులు ఉన్నా 100 మార్కులు వేయడంపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ ఒత్తిళ్లతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై మిగతా కాంట్రాక్టర్లు ప్రభుత్వానికి, ఆరోగ్యశాఖ మంత్రి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది.

అకాల వర్షం.. తడిసిన ధాన్యం


మాచారెడ్డిలో వర్షం నీళ్లను తోడేస్తున్న రైతులు

మాచారెడ్డి/బిచ్కుంద : జిల్లాలోని పలు ప్రాంతాలలో శనివారం గాలివాన బీభత్సాన్ని సృష్టించాయి. మాచారెడ్డి మండల కేంద్రంతో పాటు లక్ష్మీరావులపల్లి, చుక్కాపూర్, వాడి, పాల్వంచ, బిచ్కుంద తదితర గ్రామాల్లో వర్షం కురిసింది. వర్షంతో కొనుగోలు కేంద్రాలు, కల్లాల వద్ద వడ్లు తడిసిపోయాయి. కొన్నిచోట్ల వడ్లు కొట్టుకుపోయాయి. వర్షంలో నానకుండా ఉండేందుకు టార్పాలిన్లు కప్పినా గాలి వేగానికి అవి కొట్టుకుపోవడంతో ధాన్యం తడిసిపోయింది. మామిడి కాయలురాలిపోయాయి. విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. విద్యుత్ అధికారులు మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. రోడ్డు వెంట చెట్లు విరిగిపడడంతో ప్రయాణికులు కొద్దిసేపు ఇబ్బందిపడ్డారు.


మాచారెడ్డిలో రోడ్డుపై విరిగిపడిన చెట్టుకొమ్మలు


బిచ్కుందలో ధాన్యం ఎత్తుతున్న రైతులు

పిడుగుపాటుతో గొర్రెల కాపరి మృతి



మాచారెడ్డి : వాడి శివారులో శనివారం పిడుగుపాటుకు ఒకరు మరణించారు. వివరాలిలా ఉన్నాయి. ఫరీదుపేటకు చెందిన మదిర సురేశ్ (23) మదిర మహిపాల్ గొర్రెల మందను మేతకు తీసుకువెళ్లారు. వాడి శివారులో మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం మొదలుకావడంతో చెట్టుకిందకు చేరారు. ఆ సమయంలో పిడుగు పడడంతో సురేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్పృహ కోల్పోయిన మహిపాల్‌ను స్థానికులు కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతడి ఆరోగ్యం నిలకడగా ఉందని గ్రామస్తులు తెలిపారు. సురేశ్ స్వగ్రామం భిక్కనూరు మండలం మోటాటిపల్లి. నాలుగేళ్ల క్రితం వివాహం చేసుకుని ఫరీదుపేట గ్రామానికి ఇల్లరికం వచ్చాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకున్నామని మాచారెడ్డి ఎస్సై అనిల్ తెలిపారు.

తగాదాలకు దూరంగా ఉండడం అభినందనీయం

- 15 ఏళ్లుగా కేసుల్లేని గ్రామంగా ర్యాగట్లపల్లి నిలిచింది
- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి నాగరాణి


మాట్లాడుతున్న న్యాయమూర్తి నాగరాణి

భిక్కనూరు : తగాదాలు, పోలీసు కేసులు లేకుండా జీవించడం అభినందనీయమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి టి.నాగరాణి పేర్కొన్నారు. శనివారం ఆమె ర్యాగట్లపల్లి గ్రామాన్ని సందర్శించి గ్రామస్తులతో మాట్లాడారు. 15 ఏళ్లుగా గ్రామంలో ఒక్క పోలీస్ కేసు లేకుండా ఉండడంపై హర్షం వ్యక్తం చేశారు. ప్రతిదానికి ఘర్షణలు పడుతూ పోలీస్ కేసులు పెట్టుకుంటున్న ఈ కాలంలో ఒక్క పోలీస్ కేసు లేకుండా ప్రజలు కలసిమెలసి ఉండడం అభినందనీయమన్నారు. మూడేళ్ల క్రితం ర్యాగట్లపల్లి గ్రామం ఒక్క కేసు లేని గ్రామంగా ఎంపికైందన్నారు. అలాగే ఈ గ్రామం ఇప్పటివరకు అలానే ఉందన్నారు. ఒక్క కేసు నమోదు కాకుండా ఉన్న విషయాన్ని హైకోర్టు, సుప్రీంకోర్టులకు నివేదించేందుకోసం గ్రామాన్ని సందర్శించడానికి వచ్చానన్నారు. యువత పాశ్చాత్య సంస్కృతి మోజులో పడి వ్యసనాలకు బానిసగా మారుతోందని, తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించి తమ పిల్లలను వాటికి దూరంగా ఉంచాలని సూచించారు. గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామంలో ఏవైనా సమస్యలు ఎదురైతే ఎలా పరిష్కరించుకుంటారని ప్రశ్నించగా.. రాజీ మార్గాన్ని ఎంచుకుంటామని వారు సమాధానమిచ్చారు. తమ పెద్దలు చూపిన మార్గంలో పయనిస్తామని యువకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నేతలు నరేందర్‌రెడ్డి, ప్రతాపరెడ్డి, సిద్దరాముడ్డి, కోర్టు సూపరింటెండెంట్ చంద్రసేన్‌రెడ్డి పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులను పరిష్కరించాలి



కామారెడ్డి టౌన్ : వచ్చేనెల 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులను పరిష్కరించడానికి కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్‌వీఆర్ఆర్ వరప్రసాద్ సూచించారు. శనివారం జిల్లా కోర్టులో పోలీస్ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసుల పరిష్కారానికి పోలీస్ శాఖ మరింతగా కృషి చేయాలని సూచించారు. కక్షిదారులు జాతీయ లాక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని రాజీయే రాజమార్గంగా కేసులను పరిష్కరించుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి నాగరాణి, ఎస్పీ రాజేశ్ చంద్ర, పీపీలు రాజ్‌గోపాల్ గౌడ్, సూర్యప్రసాద్, అశోక్, నిమ్మ దామోదర్‌రెడ్డి, సీఐలు, ఎస్సైలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ప్రజలతో ఫ్రెండ్లీగా మెలగాలి



కామారెడ్డి క్రైం: పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలతో ఫ్రెండ్లీగా మెలగాలని ఏఎస్పీ చైతన్యరెడ్డి సూచించారు. శనివారం ఆమె కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. రికార్డులను, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ డయల్ 100 కు వచ్చే ఫోన్ కాల్స్‌కు వెంటనే స్పందించాలన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. కేసులు పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

‘వాహనాలను తీసుకెళ్లకుంటే వేలం వేస్తాం’

కామారెడ్డి క్రైం : కేసుల్లో పట్టుబడిన, వివిధ ప్రాంతాల్లో లభించిన వాహనాలను వాటి యజమానులు తీసుకువెళ్లాలని ఎస్పీ రాజేశ్ చంద్ర సూచించారు. ఆరు నెలల్లోగా తీసుకువెళ్లని పక్షంలో వేలం వేస్తామని పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలో 211 బైక్‌లు, 3 ఆటోలు, 3 కార్లు ఉన్నాయని, వాటి వివరాలు జిల్లా పోలీసు శాఖ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని తెలిపారు. వాహనాల యజమానులు ధ్రువీకరణ పత్రాలతో కార్యాలయానికి వచ్చి పోలీసు మోటార్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి నవీన్ కుమార్‌ను సంప్రదించాలని సూచించారు.

బడిబాటను వాయిదా వేయాలి

కామారెడ్డి టౌన్: బడిబాట కార్యక్రమాన్ని వచ్చేనెల 6వ తేదీన ప్రారంభించకుండా 9వ తేదీకి వాయిదా వేయాలని తెలంగాణ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్, ప్రధాన కార్యదర్శి కాంబ్లె గోపాల్ ప్రభుత్వాన్ని కోరారు. జూన్ 7 తేదీన బక్రీద్‌ను దృష్టిలో ఉంచుకొని బడిబాటను వేయాలని విజ్ఞప్తి చేశారు.

భిక్కనూరు సొసైటీ కార్యదర్శిపై వేటు

భిక్కనూరు : ధాన్యం తూకం వేయనందున మనస్తాపంతో ఇద్దరు రైతులు తమ వడ్లకు నిప్పు పెట్టడానికి యత్నించిన విషయంలో సహకార శాఖ అధికారులు పలువురిపై చర్యలు తీసుకున్నారు. భిక్కనూరు సింగిల్ విండో కార్యదర్శి నర్సింలును సస్పెండ్ చేస్తూ డీసీవో రామ్మోహన్ శనివారం ఆదేశాలు జారీ చేశారు. కొనుగోలు కేంద్రం పర్యవేక్షణలో విఫలమైనందున ఈ చర్య తీసుకున్నట్లు తెలిపారు. అలాగే కొనుగోలు కేంద్రం నిర్వాహకుడు గంగారాంను విధుల నుంచి తొలగించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రానికి సంబంధించిన రికార్డులను సరిగా నిర్వహించకపోవడం, వడ్లు తీసుకవచ్చిన రైతులు వివరాలను సీరియల్ రిజిస్టర్‌లో రాయకపోవడం, టోకెన్లను ఇవ్వకపోవడంతో ఆయనపై చర్యలు తీసుకున్నారు. కేంద్రాన్ని పర్యవేక్షించడంలో విఫలమైనందున కొనుగోలు కేంద్రం సూపర్‌వైజర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ రమేశ్‌కు సంజాయిషీ నోటీసు ఇచ్చారు.

క్లుప్తంగా

కొనసాగుతున్న యోగా శిక్షణ తరగతులు



యోగా శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో సమ్మర్ క్యాంప్‌లో భాగంగా శ నివారం యోగా శిక్షణ తరగతులు నిర్వహించినట్లు మండల కోర్సు ఇన్‌చార్జి వహీ దొసిద్దిఖీ తెలిపారు. ఈ సందర్భంగా యోగా శిక్షణలో భాగంగా సూర్యనమస్కారం, ధనురాసనం, శీర్షాసనం, చేతు బంధహాసనం, ప్రాణయామం, ధ్యానం చేయించినట్లు తెలిపారు. యోగా శిక్షణలో ఆరో తరగతి నుంచి 9వ తరగతి వరకు 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో యోగా నిపుణులు నర్సింలు, ఉపాధ్యాయులు ప్రభాకర్, రాజులు, యూసుఫ్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలబారిన పడొద్దు



మాట్లాడుతున్న ఎస్సై రంజిత్

సదాశివ నగర్(ఎల్లారెడ్డి): సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై రంజిత్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమానికి హాజరై అవగాహన కల్పించారు. చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐ సంతోష్ కుమార్, ఎంఈవో యోసేఫ్ తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడిగా శ్రీకాంత్



రాజంపేట: రాజంపేట మండల మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా దుబ్బని శ్రీకాంత్ నియామకమయ్యారు. జిల్లా అధ్యక్షులు ఆకుల శ్రీను నియామక పత్రాన్ని దుబ్బని శ్రీకాంత్ కు అందజేశారు.కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పెట్టిగాడిఅంజయ్య, బచ్చగారి నర్సింలు, తుల బసవయ్య, నాయిని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆటలతో సమ్మర్ సందడి

- క్రీడాశిబిరాలతో నైపుణ్యం పెరుగుదల
- జిల్లా వ్యాప్తంగా 10 సమ్మర్ క్యాంప్‌ల ఏర్పాటు

రామారెడ్డి : విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను వెలికి తీసేందుకు క్రీడా ప్రాధికార సంస్థ, జిల్లా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 6 నుంచి వేసవి క్రీడా శిబిరాలను జిల్లా వ్యాప్తంగా ప్రారంభించింది. వాటి పరిధిలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన 14 ఏళ్లలోపు బాల బాలికలు ఉదయం, సాయంత్రం వేళలో శిక్షకుల ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్నారు. నైపుణ్యాలను పెంచుకునేందుకు ఈశిబిరాలు ఎంతో ఉపయోగపడుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 10 వేసవి సమ్మర్ క్యాంప్‌లను నిర్వహిస్తున్నారు. ఈ శిబిరాల్లో కబడ్డీ, అథ్లెటిక్స్, సాఫ్ట్ బాల్, బ్యాడ్మింటన్, వాలీబాల్, ఫుట్‌బాల్, హ్యాండ్ బాల్, కోకో, టెన్నిస్ తదితర క్రీడలకు సంబంధించి శిక్షకులు ఉదయం సాయంత్రం పూట శిక్షణనిస్తున్నారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసం, శారీరక దృఢత్వం పెంచుకోవడానికి ఈశిబిరాలు దోహదపడుతున్నాయి.



రామారెడ్డిలో ఫుట్ బాల్ ఆడుతున్న బాలికలు

మెలకువలు నేర్పిస్తున్నాం

రామారెడ్డిలో ఫుట్‌బాల్ సమ్మర్ క్యాంప్ క్రీడల్లో బాలబాలికలకు క్రీడల్లో మెలకువలు నేర్పిస్తున్నాం. భవిష్యత్తులో వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. వారిలో ఆత్మవిశ్వాసం పెరగడానికి దోహదపడుతుంది.

–బాల్‌రాజు, సమ్మర్ క్యాంప్ శిక్షకుడు, రామారెడ్డి

రేషన్ కార్డ్ స్టేటస్ ఏమిటో?

- తహసీల్, ఎంపీడీవో ఆఫీస్‌ల చుట్టూ చక్కర్లు కొడుతున్న ప్రజలు
- జారీకాని రేషన్ కార్డులు



రామారెడ్డి: కొత్త రేషన్ కార్డుల కోసం, కుటుంబ సభ్యుల పేర్లు చేర్చడానికి ప్రజలు ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్నారు.జిల్లా వ్యాప్తంగా 60వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. పంచాయతీ కార్యదర్శులకు మొబైల్ యాప్‌ను అందజేశారు. రెండు నెలల క్రితం దరఖాస్తులు పరిశీలించిన కార్యదర్శులు వాటిని ఉన్నతాధికారులకు పంపించారు. ఇప్పటి వరకు రేషన్ కార్డులు జారీ కావడం లేదు. కుటుంబ సభ్యుల పేర్లు నమోదు కావడం లేదు. దీంతో దరఖాస్తుదారులు తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు.

మీ సేవా కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు..

కుటుంబ సభ్యుల పేర్లు, నమోదు కార్డుల విభజన కోసం మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్న వారికి కొత్త కార్డులు జారీ అయ్యాయి. కుటుంబ సభ్యుల పేర్లు నమోదు అవుతున్నాయి. దరఖాస్తు ఎవరి వద్ద పెండింగ్‌లో ఉందో తెలుసుకునే వీలుంది. మీసేవా కేంద్రాల ద్వారా వచ్చిన దరఖాస్తుల్లో ఇప్పటివరకు చాల వరకు పరిష్కారించారు. కొంత మందికి కొత్త కార్డులు వచ్చాయి. ఐదు సంవత్సరాల పిల్లల పేర్లను రేషన్ కార్డులో నమోదు చేయడానికి సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారు.

మళ్లీ వేచి చూడడమేనా...

ప్రజా పాలనలో ఇచ్చిన దరఖాస్తుల స్టేటస్ కనిపించడం లేదు. మీ సేవా కేంద్రాల ద్వారా మళ్లీ దరఖాస్తు చేసుకుంటే నెలరోజుల్లో పరిష్కారం అయ్యే అవకాశాలు ఉన్నాయి. మీ సేవా కేంద్రాల్లో ద రఖాస్తు చేసుకుంటే దరఖాస్తులు పరిష్కారం అవుతున్నాయి. దరఖాస్తు స్టేటస్ ఏమిటో చూసుకోవచ్చు. రేషన్ కార్డ్ రాకపోతే మీసేవా కేంద్రంలో దరఖాస్తులు చేసుకుంటే ఎక్కడ పెండింగ్ ఉందో స్టేటస్ తెలుసుకోవచ్చు. అలాగే https:// epds. telangana. gov. in/ వెబ్‌సైట్‌లో రేషన్ కార్డును ఎంటర్ చేసి ఎక్కడో పెండింగ్ ఉందో తెలుసుకోవచ్చు.

స్టేటస్ తెలుసుకోవచ్చు



మీసేవా కేంద్రాల్లో కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులు ఎక్కువగా వస్తున్నాయి, సభ్యుల కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేసుకున్నా పెండింగ్‌లో ఎక్కడుందో తెలుసుకోవచ్చు.

– రమేశ్‌రెడ్డి, మీసేవ నిర్వాహకుడు, రామారెడ్డి

బ్యాంకు కేసులు రాజీ కుదర్చాలి

- లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా న్యాయమూర్తి నాగరాణి

కామారెడ్డి టౌన్: జూన్ 14వ తేదీన జిల్లా కోర్టులో జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో సమన్యాయంతో బ్యాంక్ కేసులు రాజీ కుదర్చాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, జిల్లా న్యాయమూర్తి టి. నాగరాణి బ్యాంక్, చిట్‌ఫండ్ మేనేజర్లకు సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో బ్యాంక్, చిట్‌ఫండ్ మేనేజర్‌లతో సమావేశం నిర్వహించారు. బ్యాంకు కేసులను జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో ప్రిలిటిగేషన్ కేసులుగా కూడా పరిష్కరించుకోవచ్చని తెలిపారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి నాగరాణి

బ్యాంకు అధికారులు, చిట్ ఫండ్ కంపెనీలు వీలైనన్ని కేసుల పరిష్కారానికి సహకరించాలని కోరారు. కక్షి దారులు జూన్ 14 న జరగబోయే జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో చంద్రసేన్‌రెడ్డి, మేనేజర్లు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఒకరు డిబార్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ సెమిస్టర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం ఆర్మూర్ నరేంద్ర డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రంలో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతూ ఓ విద్యార్థి డిబార్ అయినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు.

ఉదయం నిర్వహించిన పరీక్షలకు 6,896 మందికి గాను 6,339 మంది హాజరు కాగా 557 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు. అలాగే మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు 6,110 మందికి గాను 5,641మంది హాజరు కాగా 468 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వివరించారు. నిజామాబాద్, ఆర్మూర్‌లోని పలు పరీక్షాకేంద్రాలను తెయూ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ కే.సంపత్‌కుమార్‌తో కలిసి ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రశేఖర్ తనిఖీ చేశారు. కామారెడ్డిలోని పరీక్షా కేంద్రాలను ప్రత్యేక స్క్వాడ్ బృందాలు తనిఖీ చేశాయి.

నగరంలో ఫుట్ పెట్రోలింగ్



ఖలీల్‌వాడి: నగరంలోని అహ్మదీబజార్, తదితర ప్రాంతాల్లో శనివారం డాగ్‌స్క్వాడ్‌తో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించినట్లు ఎస్సై సయ్యద్ ఇమ్రాన్ తెలిపారు. ఈసందర్భంగా పోలీసు సిబ్బంది పాన్ షాపులు, హోటళ్ల వద్ద తనిఖీలు చేపట్టారు.

19న సప్లిమెంటరీ పరీక్షలపై సమావేశం

నిజామాబాద్‌అర్బన్: నగరంలో ఖిల్లా జూనియర్ కళాశాలలో ఈనెల 19న ఉదయం 10. 30 గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో జరుగనున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు సంబంధించి ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. అధికారులు, సిబ్బంది సమావేశానికి సకాలంలో హాజరు కావాలని ఆయన తెలిపారు.

నల్లమట్టి రవాణా అడ్డగింత

మోపాల్: మండలంలోని మంచిప్ప పెద్ద చెరువు నుంచి తరలిస్తున్న నల్లమట్టి రవాణాను శనివారం గ్రామస్తులు అడ్డుకున్నారు. చెరువులో ఇష్టారీతిన చేపట్టిన తవ్వకాల వల్ల పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదాలు జరిగే అవకాశముందని వారు ఆరోపించారు. తక్కు వ లోతుతో తవ్వకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అధిక లోడ్‌తో మట్టిని తరలించడం వల్ల రోడ్లు ధ్వంసం అవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. నల్లమట్టి తరలిస్తున్న వాహనాలను అడ్డుకుని అధికారులకు ఫిర్యాదుచేశారు.

నవీపేట మండలంలో సైబర్ మోసం

నవీపేట: మండలంలోని పొల్దా గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సైబర్ మోసానికి గురైనట్లు తెలిసింది. సదరు వ్యక్తికి రెండు రోజుల కిందట గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి.. బ్యాంక్ నుంచి మాట్లాడుతున్నట్లు నమ్మించాడు. మీ ఫోన్ నంబరు వేరే వ్యక్తి ఖాతాకు లింకైందని, ఇలా జరిగితే జైలు శిక్ష పడుతుందని భయపెట్టించాడు. తమకు డబ్బు పంపితే శిక్ష పడకుండా చూస్తామన్నారు. వెంటనే బాధిత వ్యక్తి ఈనెల 15న కొంత డబ్బును పంపించాడు. మళ్లీ శనివారం ఫోన్ చేసి మరింత డబ్బు పంపాలని బెదిరించడంతో రూ.28వేలు పంపించాడు. ఇలా ఇప్పటి వరకు రూ.లక్షా ఇరవై వేలు ఆన్‌లైన్‌లో పంపించాడు. అనుమానం వచ్చిన సదరు వ్యక్తి కుటుంబ సభ్యులకు తెలుపగా మోసపోయినట్లు తెలుసుకున్నాడు. పోలీసులను సంప్రదించి ఫిర్యాదు చేశాడు.

ఎస్సీ వర్గీకరణ రద్దయ్యే వరకు పోరాటం చేద్దాం



మాట్లాడుతున్న మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య

నిజామాబాద్‌నాగారం: ఎస్సీ వర్గీకరణ రద్దయ్యే వరకు న్యాయ పోరాటం చేద్దామని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని కేసీఆర్ కాలనీలోగల ఓ ఫంక్షన్‌హాల్‌లో శనివారం మాలమహానాడు జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చెన్నయ్య హాజరై మాట్లాడారు. మనమందరం ఐక్యంగా ఉండి కోర్టు ద్వారా ఎస్సీ వర్గీకరణ రద్దు అయ్యేవరకు న్యాయ పోరాటం చేయాలన్నారు. అందుకు ప్రతి మాల సోదరుడి నైతిక సహాయం అవసరం ఉందని తెలిపారు. నిర్మల్ జిల్లా ముథోల్ మండల బోరేగంలో బుద్ధ పూర్ణమి రోజున బుద్ధ భగవాన్ విగ్రహం పెట్టినందుకు దళితులపై అగ్రకులాల వారు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దాడికి పాల్పడ్డవారిపై పోలీస్ కేసులు పెట్టి చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడ్ల నాగరాజు, ఎల్లయ్య, జిల్లా నూతన అధ్యక్షుడు చొక్కం దేవిదాస్, టీమ్ కన్వీనర్ అలుక కిషన్, జిల్లా ప్రధాన కార్యదర్శి నాంది వినయ్ కుమార్, కోశాధికారి రాజన్న, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు స్వామిదాస్ తదితరులు పాల్గొన్నారు.

జంక్ ఫుడ్, నిల్వ ఆహారాన్ని తీసుకోవద్దు

- జీవనశైలి మార్పులతోనే అధిక రక్తపోటు నియంత్రణ
- ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్
- నగరంలో ప్రపంచ అధిక రక్తపోటు నియంత్రణ దినోత్సవం

నిజామాబాద్‌నాగారం: ప్రజలు నిల్వ ఆహార పదార్థాలను, బేకరి, జంక్ ఫుడ్స్ వాడొద్దని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్‌సూచించారు. ప్రతిఒక్కరూ జీవనశైలీ మార్పులతోనే అధిక రక్తపోటు నియంత్రణలో ఉంటుందని అన్నారు. నగరంలోని అర్సపల్లి పట్టణ ఆరోగ్య కేంద్రంలో శనివారం ప్రపంచ అధిక రక్తపోటు నియంత్రణ దినోత్సవం సందర్బంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

అనంతరం నగరంలోని జిల్లా శిక్షణ కేంద్రం పీహెచ్‌డీటీటీలో వైద్య సి బ్బందికి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధిక రక్తపోటు నివారణకు ప్రతి ఒక్కరూ ఉప్పు వాడకాన్ని తగ్గించాలని ఆహారాన్ని పరిమిత స్థాయిలో తీసుకోవాలన్నారు. నిత్యం వ్యాయామం, నడక, యోగా, ప్రాణయామం లాంటివి చేయాలన్నారు. వైద్యాధికారులు అంజన, స్వామోట్ యాదవ్, అజ్మతున్నిసా



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యశాఖ అధికారులు, ఉద్యోగులు

అల్ప్రాజోలం పట్టివేత



బోధన్ మండలంలోని బెల్లాల్‌లో పట్టుకున్న అల్ప్రాజోలం, నిందితుడితో ఎక్సైజ్ పోలీసులు

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ మండలంలోని బెల్లాల్ గ్రామంలో 264 గ్రాముల అల్ప్రాజోలం పట్టుకున్నట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ స్వప్న శనివారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు బెల్లాల్ గ్రామంలోని ముస్తాబాద్ వీరగౌడ్ ఇంట్లో సోదాలు నిర్వహించగా అల్ప్రాజోలం లభించిందని, వెంటనే వీరగౌడ్‌ను అదుపులోకి తీసుకొని, సరుకును స్వాధీనం చేసుకున్నామన్నారు. తదుపరి చర్యల నిమిత్తం బోధన్ ఎక్సైజ్ కార్యాలయానికి అప్పగించినట్లు తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ సీఐ భాస్కర్‌రావ్ తెలిపారు. ఈ సోదాల్లో సబ్ ఇన్‌స్పెక్టర్ నరసింహ చారీ, రామ్‌కుమార్, సిబ్బంది రామ్ బచ్చన్, గంగారాం, సాయికుమార్‌లు ఉన్నారు.

ఒకరిపై కేసు నమోదు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పర్మళ్ల గ్రామానికి చెందిన లెగ్గల రాజు అనే యువకుడిపై శుక్రవారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకట్రావు తెలిపారు. సదరు యువకుడు ముస్తాపూర్ గ్రామానికి చెందిన ఓ వివాహిత పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి, వేధింపులకు గురిచేసినట్లు తెలిపారు. దీంతో వివాహిత పోలీసులకు ఫిర్యాదు చేయగా, పలు సెక్షన్ల కింత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

బైక్‌ను ఢీకొన్న అడవిపంది: ఒకరి మృతి



పోచయ్య (ఫైల్)

నవీపేట: మండలంలోని అబ్బాపూర్(ఎం) శివారులో బైక్‌పై వెళుతున్న ఓ వ్యక్తిని అడవి పంది ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. ఎడపల్లి మండలంలోని పోచారం గ్రామానికి చెందిన సుంకరి పోచయ్య(46) శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన వారాంతపు కూరగాయల సంతకు వచ్చాడు. రాత్రి సమయంలో బైక్‌పై తిరిగి సొంతూరికి బయలుదేరాడు. మండలంలోని అబ్బాపూర్(ఎం) శివారులో అడవి పందుల గుంపు రావడంతో అతడి బైక్‌ను ఓ అడవి పంది ఢీకొట్టింది. దీంతో అతడు కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు గమనించి అతడిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి భార్య వసంత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వినయ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..



భిక్కనూరు: మండలంలోని జంగపల్లి గ్రామశివారులోగల జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన బచ్చగారి క్రిష్ణమూర్తి (48) శనివారం వ్యక్తిగత పనుల మీద బైక్‌పై రాజంపేటలోని అత్తగారింటికి వెళ్లాడు. కొంత సమయానికి తిరిగి బైక్‌పై భిక్కనూరుకు బయలుదేరగా, జంగంపల్లి శివారులో అతడి బైక్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో అతడు కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి అతడిని వెంటనే కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

కూతురిపై తండ్రి లైంగికదాడి

ఖలీల్‌వాడి: నగరంలోని భారతీరాణికాలనీకి చెందిన ఓ వ్యక్తి (68) తన కూతురు(28)పై లైంగిక దాడికి పాల్పడినట్లు ఎస్సై గంగాధర్ శనివారం తెలిపారు. ఈ ఘటనపై బాధితురాలు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాడుతున్న 14మంది అరెస్టు



నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని సంగం గ్రామంలో పేకాట ఆడుతున్న 14 మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై అరుణ్ కుమార్ శనివారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం రావడంతో ఎస్సై వెంటనే తమ సిబ్బందితో పేకాట స్థావరంపై దాడి చేశారు. పేకాడుతున్న వారిని పట్టుకొని, వారి వద్ద నుంచి 8 బైకులను, రూ.4500 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. కానిస్టేబుల్ రమేష్, శ్రీధర్, గౌరి ఉన్నారు.

గంజాయి తాగిన వ్యక్తి అరెస్టు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): గంజాయి తాగిన ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై యాదగిరి గౌడ్ తెలిపారు. మండలకేంద్రంలో శనివారం ప్రొబేషనరీ ఎస్సై శైలేందర్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు చేపట్టగా, శ్రీరాం నగర్ తండాకు చెందిన భామన్ బహదూర్ సింగ్ బైక్‌పై వెళుతుండగా ఆపి తనిఖీ చేశారు. అతడు గంజాయి తాగినట్లు గుర్తించి, పట్టుకున్నారు. బైక్‌లో ఉన్న 45 గ్రాముల గంజాయిని, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. సిబ్బందిని పోలీస్ ఉన్నతాధికారులు, సౌత్ రూరల్ సీఐ సురేష్‌కుమార్ అభినందించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



నందిపేట్(ఆర్మూర్): మండలంలోని తల్వేద గ్రామ సమీపంలోని గోదావరి నది పరివాహక ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై చిరంజీవి శనివారం తెలిపారు. మండలంలోని చింరాజ్‌పల్లి గ్రామ సమీపంలో తనిఖీలు చేపడుతుండగా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు కనిపించడంతో వాటిని పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. ఇసుక ట్రాక్టర్ల డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నాడు.

నకిలీ డాక్టర్‌పై కేసు నమోదు

ఖలీల్‌వాడి: నగరంలోని బోధన్ రోడ్డులో ఫస్ట్ ఎయిడ్ సెంటర్ నడిపిస్తున్న నకిలీ డాక్టర్‌పై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి శనివారం తెలిపారు. మేకల రాకేష్ అనే వ్యక్తి విజిలెన్స్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేయగా, అధికారులు ఇటీవల ఆస్పత్రిలో తనిఖీ చేశారు. ఆస్పత్రి నిర్వాహకుడు ఎలాంటి డాక్టర్ పట్టా లేకుండా రోగులకు వైద్యం అందిస్తున్నట్లు గుర్తించారు. దీంతో అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అధికారులు

బోధన్‌టౌన్(బోధన్): రోడ్డు ప్రమాదాలు జరుగకుండా ప్రతిఒక్కరూ కృషి చేయాలని, వాహనాలు నడిపేటప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలని ట్రాన్స్‌పోర్ట్ జిల్లా అధికారి ఉమామహేశ్వర్‌రావ్ అన్నారు. పట్టణంలోని ఇందూర్ హైస్కూల్‌లో శనివారం ట్రస్మా ఆధ్వర్యంలో ట్రాన్స్‌పోర్ట్, అగ్నిమాపక శాఖ, ట్రాఫిక్ శాఖలు సంయుక్తంగా రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను మాక్ డ్రిల్ చేసి చూపించారు. రోడ్డు ప్రమాదాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నియంత్రణ చర్యలను వివరించారు. అనంతరం ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల కరపత్రాలను ఆవిష్కరించారు. ఎంవీఐ శ్రీనివాస్, ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్, అగ్నిమాపక శాఖ అధికారి సుభాష్, ఎంఈవో నాగయ్య, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కోడాలి కిశోర్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నీరు ఇలా.. పశువులు తాగేదెలా..?



చిన్న రాంపూర్‌లో నీటితొట్టిలో పాకురు

బాన్సువాడ రూరల్: మూగజీవాల దాహార్తిని తీర్చాలనే ఉద్దేశంతో గ్రామాల్లో నిర్మించిన పశువుల నీటి తొట్టెలు నిర్వాహణ లోపంతో అపరిశుభ్రంగా ఉంటున్నాయి. పంచాయతీ సిబ్బంది నీటితొట్టిలను నెలల తరబడి శుభ్రం చేయకపోవడంతో నీటితొట్టిలో పాకురు పేరుకు పోతుంది. మండంలోని చిన్న రాంపూర్ లో నీట్టి తొట్టిలో నీరు పాకురి పట్టి అపరిశుభ్రంగా ఉంది. పలుచోట్ల రైతులు నీటితొట్టిల్లో తూకంనారు బస్తాలు తడపడానికి ఉంచుతుండటంతో నీరు కలుషితం అవుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు.

పసిబిడ్డతో కలిసి మహిళ ఆత్మహత్యాయత్నం

- కాపాడిన పోలీసులు

బాన్సువాడ: బాన్సువాడ పట్టణంలోని కల్కి చెరువులో శనివారం ఓ మహిళ పసిబిడ్డతో కలిసి ఆత్మహత్యకు యత్నించగా, పోలీసులు అడ్డుకొని కాపాడారు. మండలంలోని కోనాపూర్ గ్రామానికి చెందిన ఓ మహిళ పసిబిడ్డతో వచ్చి కల్కి చెరువులోకి దూకే ప్రయత్నం చేసింది. స్థానికులు గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి వారిని కాపాడారు. సదరు మహిళకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

ఆత్మహత్యకు యత్నించడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఏఎస్సై విజయ్, కానిస్టేబుళ్లు ప్రవీణ్, సౌజన్య, నవీన్, అంజయ్య, శ్రీనివాస్‌లు ఉన్నారు.